క్లుప్తంగా

మంత్రికి సన్మానం



మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

కందుకూరు: పలు అభివృద్ధి పనులు ప్రారంభించడానికి తుక్కుగూడకు విచ్చేసిన మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డిని గురువారం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, ఏనుగు జంగారెడ్డి తదితరులు సన్మానించారు. వారి వెంట నాయకులు ఎస్.కృష్ణనాయక్, కె.రాణాప్రతాప్ రెడ్డి, ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎండీ అఫ్జల్‌బేగ్, ఎస్.జగన్, పాండు, బి.ప్రశాంత్‌కుమార్, రాకేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



బాలాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని బస్తీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో బాలాపూర్ మండల తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్, శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ.. బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిని తీర్చేలా చూడాలని కోరారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం, రేషన్‌కార్డులు, పింఛన్లు, గ్యాస్ సబ్సిడీ, ఉచిత కరెంట్, గృహలక్ష్మి వంటి సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అమలు అయ్యేలా చూడాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చకపోతే సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సంఘాల మద్దతుతో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామన్నారు. వినతి పత్రం ఇచ్చినవారిలో అనురాధ, లక్ష్మి, యాదగిరి తదితరులు ఉన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



మీర్‌పేటలో మిఠాయిలు పంచుకుంటున్న నాయకులు

మీర్‌పేట: ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులు ఘన విజయం సాధించిన సందర్భంగా గురువారం మీర్‌పేట కూడలిలో స్థానిక బీజేపీ నాయకులు బాణాసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచిపెట్టారు. పట్టభద్రుల ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలిచిన ఉపాధ్యాయులు, పట్టభద్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మీర్‌పేట–1, 2 అధ్యక్షులు భిక్షపతిచారి, ముఖేశ్ ముదిరాజ్, నాయకులు కీసర గోవర్ధన్‌రెడ్డి, గాజుల మధు, సోమేశ్వర్, మద్ది రాజశేఖర్‌రెడ్డి, గడ్డం జగన్, జే.డీ.కుమార్, కాశీరాంయాదవ్, సత్తయ్య, సుధాకర్, విక్కీసాగర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తీర్చాలని నిరసన



నిరసన తెలుపుతున్న 14వ డివిజన్‌వాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ జెనిగె కొమురయ్య కాలనీలో తాగునీటి సమస్య తీర్చాలని కోరుతూ ఆ డివిజన్ ప్రజలు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరునెలలుగా తా గునీటి సమస్య తీవ్రంగా ఉందని, కృష్ణ తాగునీరు రాకపోయినప్పటికీ ఇంటింటికీ బిల్లులు మాత్రం వేస్తూ కట్టాలని వేధిస్తున్నారన్నారు. వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆరోపించారు. నీటి సరఫరా లేకుండా ఇంటింటికీ రూ.17వేల దాకా నీటి బిల్లులు వేస్తున్నారని వాపోయారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, వాటర్ వర్క్స్ అధికారులు స్పందించి తాగునీటిని సరఫరా చేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ సరస్వతికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ కార్పొరేషన్–1 అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కాలనీవాసులు జగదీశ్వర్‌రెడ్డి, నారాయణ, భరత్, వెంకటస్వామి, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

బడికి బస్సు కష్టాలు

- మామిడిపల్లికి సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో తప్పని తిప్పలు
- ఆటోలను ఆశ్రయిస్తూ ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- డ్రాపౌట్స్‌గా మిగిలిపోతున్న వైనం
- పూర్తిస్థాయిలో బస్సులు నడపాలని గ్రామస్తుల విన్నపం



పహాడీషరీఫ్ నుంచి ఆటోలో వెళ్తున్న విద్యార్థులు



జల్‌పల్లి నుంచి నడుచుకుంటూ వస్తున్న విద్యార్థులు

పహాడీషరీఫ్: ఆ గ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రెండు నిమిషాల్లో వెళ్లి ఎంచక్కా విమానం ఎక్కేయొచ్చు.. ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన ఈ గ్రామం చుట్టూ పెద్దఎత్తున కొనసాగుతున్న విల్లాలు, అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు.. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో ఏర్పాటవుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలు.. వెరసి దినదినాభివృద్ధి చెందుతున్న బాలాపూర్ మండల పరిధిలోని మామిపల్లి గ్రామానికి ప్రజా రవాణా వ్యవస్థ మాత్రం కరువైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా అన్ని వసతులు, నాణ్యమైన విద్యాబోధనతో దాదాపు 700 మంది విద్యార్థులను కలిగి ఆదర్శంగా మారిన ‘మామిడిపల్లి ప్రభుత్వ ప్రాథమిక, జెడ్పీహెచ్‌ఎస్’ విద్యార్థులను రవాణా సదుపాయం తీవ్రంగా వేధిస్తోంది. శ్రీశైలం జాతీయ రహదారి(పహాడీషరీఫ్)–బెంగుళూర్ జాతీయ రహదారి(శంషాబాద్)ల మధ్య ఉన్న తమ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి తమ కష్టాలు దూరం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చదువు కంటే రవాణాపైనే ధ్యాస..

మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చుట్టూ పక్కన ప్రాంతాలైన ఎర్రకుంట, షాహీన్‌నగర్, పహాడీషరీఫ్, రంగ నాయకుల కాలనీ, బాలాజీ కాలనీ, జల్‌పల్లి గ్రామాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో విద్యనభ్యసిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల మధ్య పాఠశాల కొనసాగుతుంది. దాదాపు 5–10 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే ఈ విద్యార్థులకు ప్రధాన రవాణ సదుపాయం ఆర్టీసీ బస్సు. గతంలో పూర్తిస్థాయిలోనే బస్సులు నడిపినప్పటికీ, మహేశ్వరం/ఫలక్‌నుమా ఆర్టీసీ బస్సు డిపోలు పరిధిని పంచుకోవడంతో గత కొన్నేళ్ల నుంచి అన్ని సర్వీసులు రద్దు చేసి కేవలం ఒక బస్సును మాత్రమే పాఠశాల విద్యార్థుల కోసమని ఉదయం, సాయంత్రం నడుపుతున్నారు. అది కూడా పాఠశాల సమయానికి అనుగుణంగా బస్సులను నడపకపోవడంతో విద్యార్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. మధ్యాహ్నం 3 గంటలకు పహాడీషరీఫ్ నుంచి మామిడిపల్లి వచ్చి మళ్లిపోయే బస్సుతో పెద్దగా ప్రయోజనం లేకుండా పోతోంది.

డ్రాపౌట్స్‌గా మిగిలిపోతున్న విద్యార్థులు

చార్మినార్ నుంచి బయలుదేరి శంషాబాద్ మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే ఫలక్‌నుమా డిపోకు చెందిన బస్సు చాంద్రాయణగుట్ట, ఎర్రకుంట, షాహీన్‌నగర్, పహాడీషరీఫ్ మీదుగా ఉదయం 8.20 గంటలకు మామిడిపల్లి గ్రామానికి చేరుకుంటుంది. 9 గంటలకు పాఠశాల ఉండగా ఎర్రకుంట, పహాడీషరీఫ్ విద్యార్థులు గంట ముందుగానే 8 గంటలకే బస్సు ఎక్కాల్సి ఉంటుంది. ఈ కారణంగా చాలా మంది విద్యార్థులు బస్సును అందుకోలేక ఆటోలను ఆశ్రయించి డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. ఇలా నిత్యం డబ్బులు ఇవ్వలేక కొందరు తల్లిదండ్రులు పిల్లలను బడి మాన్పిస్తున్నారు. ఇక జల్‌పల్లి, రంగ నాయకుల కాలనీ విద్యార్థులకు బస్సు సదుపాయం లేక నిత్యం 8–10 కిలోమీటర్లు నడక తప్పడం లేదు.

చిన్నపాటి మార్పులతో పరిష్కారం

- ప్రత్యేక బస్సు సర్వీసులతో పనిలేకుండా చిన్నపాటి మార్పులతో ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది. ప్రస్తుతం చార్మినార్ నుంచి మామిడిపల్లి మీదుగా శంషాబాద్‌కు వెళ్లే బస్సును ఉదయం, సాయంత్రం వేళల్లో అరగంట ఆలస్యం(8.50/4.30)గా నడిపితే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుంది.
- చాంద్రాయణగుట్ట నుంచి పహాడీషరీఫ్ వరకు వచ్చి మళ్లిపోయే బస్సులలో కొన్నింటిని ఉదయం, సాయంత్రం వేళల్లో పక్కనే ఉన్న మామిడిపల్లి మీదుగా శంషాబాద్ వరకు నడిపితే ఆర్టీసీకి ఆదాయంతో పాటు ప్రయాణికులకు ఎంతో వెసులుబాటు కానుంది.
- కోఠి నుంచి జల్‌పల్లికి పెద్ద ఎత్తున ఎలాగో బస్సులు నడుస్తున్న దృష్ట్యా ఉదయం, సాయంత్రం పాఠశాల సమయాలలో ఒక్క బస్సునైనా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న మామిడిపల్లికి నడిపితే విద్యార్థులకు నడక కష్టాలు తీరుతాయి.

తప్పని ఎదురుచూపులు..

- మామిడిపల్లి నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న శంషాబాద్‌లోని ఇంటర్, డిగ్రీ కళాశాలలకు ఈ గ్రామం నుంచి వెళ్లాల్సిన విద్యార్థులు 10 గంటలకు అక్కడికి చేరుకోవాల్సి ఉండగా, ఒకే బస్సు ఉండడంతో గంటన్నర ముందే ఇక్కడి నుంచి వెళ్లి అక్కడ ఎదురుచూపులు గడపక తప్పడం లేదు.
- శంషాబాద్ నుంచి మామిడిపల్లి తిరిగి వచ్చే ఈ బస్సు సాయంత్రం పూట కూడా విద్యార్థులకు వినియోగం లేకుండా పోతోంది. అటు శంషాబాద్‌లో కళాశాలలు విడవకముందే బయలుదేరడం, ఇటు మామిడిపల్లికి కూడా పాఠశాల వదలడం కంటే 15 నిమిషాల ముందే 4 గంటలకే చేరుకుంటుంది. ఈ కారణంగా కళాశాల విద్యార్థులు అందుకోకపోవడంతో పాటు పాఠశాల విద్యార్థులు కూడా బస్సు ఎక్కలేని పరిస్థితి నెలకొంటుంది.

అధికారుల్లో చలనం లేదు



విద్యార్థులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించాం. పాఠశాల విద్యార్థులతో పాటు గ్రామస్తులు ఎక్కడికెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. నగరం నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్నపాటి గ్రామాలకు ఐదారు సిటీ బస్సులను నడుపుతున్న అధికారులు మామిడిపల్లికి నడపడంలో పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారు. అనువైన సమయంలో బస్సులను నడిపి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– ఈరంకి విశ్వనాథ్‌గౌడ్, మామిడిపల్లి

8 కిలోమీటర్లు నడిచి అలసిపోతున్నా



జల్‌పల్లిలో 8వ తరగతి వరకే ఉండడంతో 9వ తరగతి చదువు కోసం మామిడిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో చేరాను. బస్సు సదుపాయం లేకపోవడంతో రానుపోను రోజుకు 7–8 కిలోమీటర్లు నడిచి అలసిపోతున్నాను. చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నాం. మున్సిపాలిటీగా ఉన్న మా ఊరు నుంచి పక్కనే ఉన్న మామిడిపల్లికి ఎందుకు బస్సులు నడపరు? చాలా మంది ఆడపిల్లలు ఎనిమిది తరగతి చదివి బడి మానేస్తున్నారు.

–శ్రీకాంత్, 9వ తరగతి విద్యార్థి

ప్రజలను మోసం చేసిన ఎమ్మెల్యే

- బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్



మాట్లాడుతున్న శ్రీరాములుయాదవ్

తుక్కుగూడ: ఎన్నికల సమయంలో కుల సంఘాల భవనాల నిర్మాణాల పేరుతో నియోజకవర్గ ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకున్న వ్యక్తి సబితా ఇంద్రారెడ్డి అని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అన్నారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని తుక్కుగూడ పురపాలక సంఘం పరిధిలోని రావిర్యాల గ్రామంలో యాదవులు, రెడ్డి, పద్మశాలి, నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వ భూమిలో ఒకే ప్రదేశంలో కులసంఘాల భవనాలను నిర్మిస్తామని గత ప్రభుత్వంలో ఆమె మంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారన్నారు. ఇప్పుడు ఆ భూమిని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం లెన్స్‌కార్ట్ పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించి, మంత్రి శ్రీధర్‌బాబు పూజ చేయడం ఏమిటిని ఆయన ప్రశ్నించారు?. ఇప్పుడు ప్రభుత్వంపై ఎందుకు ఆమె పోరాటం చేయడం లేదన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఊరిలో కులసంఘాల పేరుతో శంకుస్థాపన చేశారన్నారు. ఆనాడు ఆ భూములకు పట్టాలు ఇచ్చి ఉంటే ఈ రోజు ఈ సమస్య వచ్చేది కాదన్నారు. కులసంఘాలకు ఇచ్చిన భూములను ప్రభుత్వం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల తరఫున పోరాటాలు చేస్తామన్నారు.

భవిష్యత్ నిర్మాణంలో ఆవిష్కరణలు కీలకం

మొయినాబాద్: ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్(ఏఐ) రంగంలో భవిష్యత్‌ను రూపొందించడంలో సాంకేతికత, ఆవిష్కరణలు ఎంతో కీలకమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని విద్యాజ్యో తి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సమాచార సాంకేతిక పరిజ్ఞానం, కంప్యూటర్ సైన్స్ రంగంలో తాజా పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఐఏ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు దీనిపై స్థిరమైన అభ్యాసం, నైపుణ్యం పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ కళాశాలల నుంచి సుమారు 800 మంది పాల్గొని పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, డిజైన్ ఏ థాన్, కోడ్ ఏ థాన్, సాంకేతిక సెషన్లు నిర్వహించారు. కార్యక్రమంలో డీబీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిరామ్ బొమ్మరాజు, సీఎస్ఐ హెడ్ చైర్మన్ సి.సుధాకర్, సీఎస్ఐ ప్రతినిధి రాజు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న సుభాన్‌యాదవ్, మాజీ మేయర్ పారిజాత తదితరులు

బడంగ్‌పేట్: మహేశ్వరం నియోజకవర్గంతో పాటు అతిపెద్ద కార్పొరేషన్ అయిన బడంగ్‌పేటలో నిలిచిపోయిన పనులు వెంటనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్ కోరారు. గురువారం తుక్కుగూడకు వివిధ కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు విచ్చేసిన మంత్రిని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుభాన్‌యాదవ్ మాట్లాడుతూ.. నాదర్‌గుల్ నుంచి గాంధీనగర్ వరకు ఆగిన రోడ్డు విస్తరణ పనులు మొదలు పెట్టేలా చూడాలని, పనులు పూర్తికాగానే సెంట్రల్ లైటింగ్ సిస్టం పోల్స్ ఏర్పాటు చేయించాలని కోరారు. నాదర్‌గుల్‌లోని సున్నం చెరువు నుంచి తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు వరకు వెళ్తున్న వరదనీటి కాలువను అభివృద్ధి చేయించాలని విన్నవించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పక్కన నూతనంగా నిర్మిస్తున్న భవనంలోకి సాగర్ రింగ్‌రోడ్డులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వచ్చేలా చూడాలని కోరారు. బడంగ్‌పేటలో ఉన్న క్రీడా మైదానం సౌకర్యాలకు నోచుకోవడం లేదని తగిన సౌకర్యాలు కల్పించి క్రీడాకారులకు, యువతకు శిక్షణ ఇచ్చేలా చూడాలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని ఎంతో మంది నిరుద్యోగ యువతీ యువకులు ఉన్నారని స్థానికంగా ఆదిబట్లలో ఏర్పడిన టీసీఎస్, టాటా, ఎయిరో స్పేస్ ఇతర కంపెనీల్లో ఉద్యోగాలు స్థానికులకు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. మహేశ్వరంలోని ఎస్‌డీ తండాలో ప్రభుత్వ పాఠశాల వద్ద చెత్త వేస్తూ డంపింగ్ యార్డుగా మార్చివేశారని, దీంతో విద్యార్థులు, స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వెంటనే తొలగించేలా అధికారులను పురమాయించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ మేయర్ చిగురింత పారిజాత, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌నింగని జంగయ్య, ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్, భానుప్రకాశ్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఫార్మా రైతుల ప్లాట్లకు కబ్జా చూపాలి



ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

కందుకూరు: ఫార్మా రైతులకు కేటాయిస్తూ ఇచ్చిన ప్లాట్ల సర్టిఫికెట్లకు కబ్జా చూపాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.రాంచందర్ డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ఆకులమైలారంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ఎక్కడ చూసినా ప్రతి ఇంటికి సమస్య ఉందన్నారు. ఇళ్ల స్థలాల సమస్యతో పాటు రేషన్‌కార్డులు, పింఛన్లు, కరెంట్ జీరో బిల్లులు అందడం లేదన్నారు. పీఓటీ భూముల సమస్య ఉందన్నారు. తాము చేపట్టిన సర్వేలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ కార్యదర్శి నోముల నర్సింహా, నాయకులు గండు మహేందర్, అచ్చన శివయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ద్వితీయ సంవత్సరం పరీక్షలు

మహేశ్వరం: మండలంలోని ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,756 మంది విద్యార్థులకు గాను 1,744 మంది పరీక్షలకు హాజరై.. 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని కస్టోడియన్ నర్సయ్య తెలిపారు. పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమైంది. 30 నిమిషాల ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. విద్యార్థులను ఇన్విజిలేటర్లు క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మహేశ్వరం పోలీసులు 144 సెక్షన్‌ను అమలు చేశారు. మాస్ కాపీయింగ్ జరగకుండా సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. మహేశ్వరం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్షా కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ సందర్శించి, పరీక్షల సరళిని కస్టోడియన్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు కృషి చేయాలని ఆమె ఇన్విజిలేటర్లకు సూచించారు.

25 మంది గైర్హాజరు

కందుకూరు: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు ద్వితీయ భాషా పరీక్షలకు మొత్తం 1066 మందికిగాను 25 మంది గైర్హాజరవగా 1041 మంది హాజరయ్యారు. నేదునూరు మోడల్ కళాశాల కేంద్రంలో 410 మంది విద్యార్థులకు గాను 8 మంది గైర్హాజరయ్యారు. కొత్తగూడ చౌరస్తాలోని విద్యామయి జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 306 మందికిగాను ముగ్గురు గైర్హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 350 మందికిగాను 14 మంది గైర్హాజరైనట్లు ఆయా కేంద్రాల నిర్వాహకులు తెలిపారు.

మాలల అస్తిత్వానికి పోరాడుదాం



మాట్లాడుతున్న జిల్లా జేఏసీ సభ్యులు

చేవెళ్ల: మాలల అస్తిత్వం కోసం అందరూ ఏకమై ఐక్యతతో కలిసి పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాల సంఘాల జిల్లా జేఏసీ నాయకులు అన్నారు. మండల కేంద్రంలో గురువారం మాల సంఘాల జిల్లా జేఏసీ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాలలపై జరుగుతున్న కుట్రలను, ఉనికి, వర్గీకరణ ముసుగులో మాలలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ముసుగులో మాలలను ద్రోహులుగా, దోషులుగా చిత్రీకరించటం సరికాదన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పోరాటాల ద్వారా వచ్చిన రిజర్వేషన్ల అవకాశాలను అందిపుచ్చుకోవటమే తప్పు చేసినట్లుగా సమాజానికి చెప్పటం దురదృష్టకరమన్నారు. మాలల అస్తిత్వం కోసం మాలల్లోని మేధావులు, రాజకీయ నాయకులు, ఉద్యమకారులు విద్యార్థులు మేల్కొని ముందుకురావాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్పుల మల్లేశ్, జిల్లా అధ్యక్షుడు రామస్వామి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్, అలిండియా అంబేడ్కర్ సంఘం నాయకులు ఎం.శ్రీనివాస్, సత్యం, మహేశ్, సంజీవ ఉన్నారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

శంకర్‌పల్లి: పట్టణంలోని శ్రీ చైతన్య, మాస్టర్ మైండ్ పాఠశాల యాజమాన్యాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన గురువారం ఒక ప్రకటనలో మాట్లాడుతూ.. ఈ రెండు పాఠశాలలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు లేకున్నప్పటికీ విద్యార్థులను చేర్చుకొని పాఠశాలలు నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈ పాఠశాలలకు సరైన బిల్డింగ్స్, మైదానాలు, ఫైర్ సేఫ్టీ, క్వాలిఫైడ్ టీచర్లు సైతం లేరన్నారు. ఈ పాఠశాలలను విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు.

స్వర్ణగిరికి ప్రత్యేక బస్సులు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ సిటీ డిపో నుంచి స్వర్ణగిరి టెంపుల్‌కు ప్రత్యేక మెట్రో డీలక్స్ బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు మేనేజర్ టి.సమత తెలిపారు. ప్రతి శని, ఆదివారం ఉదయం 8 గంటల నుంచి బస్సులు ప్రారంభం అవుతాయని, ఎల్‌బీనగర్, ఉప్పల్ క్రాస్ రోడ్డు, ఘట్‌కేసర్ మీదుగా ప్రతి గంట నలభై నిమిషాలకు బస్సు ఉంటుందన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.15, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.18, పొట్లకాయ రూ.18, అరటి కాయ రూ.09, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.55, మునగ రూ.45, కందగడ్డ రూ.55, బీట్‌రూట్ రూ.15, కీర రూ.23, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.33. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

దైవచింతనతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మోత్కులగూడలో గురువారం ఆంజనేయస్వామి, వినాయకుడు, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాలు నిర్మించడంతో పాటు నిత్యం దూపదీప నైవేద్యాలు సమర్పించాలని సూచించారు. ఆయన దేవాలయ నిర్మాణానికి, విగ్రహాల ప్రతిష్ఠ నిమిత్తం రూ.4లక్షల నగదును విరాళంగా నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నర్సింహ, జేకే నర్సింహ, జెట్ట కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యులు కాట్న లతశ్రీశైలం, కాట్న మాధవిరవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహాగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో గ్రామస్తులతో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి